04-12-2023 ప్రాత:మురళి ఓంశాంతి "బాప్ దాదా" మధువనం

“మధురమైన పిల్లలూ - మీకు సద్గురువు యొక్క సహజ వశీకరణ మంత్రము లభించింది, అదేమిటంటే - మౌనంగా ఉంటూ నన్నొక్కరినే స్మృతి చేయండి, ఇదే మాయను ఆధీనంగా చేసుకునేందుకు మహామంత్రము”

ప్రశ్న:- శివబాబాయే అందరికన్నా భోళా గ్రాహకుడు - అది ఎలా?

జవాబు:- బాబా అంటారు - పిల్లలూ, మీ వద్ద దేహ సహితంగా పాత చెత్త ఏదైతే ఉందో, అది నేను తీసుకుంటాను, అది కూడా మీరు మరణించే సమయానికి చేరుకున్నప్పుడు తీసుకుంటాను. మీ శ్వేత వస్త్రాలు కూడా మరణానికే గుర్తు. మీరు ఇప్పుడు తండ్రిపై బలిహారమవుతారు. తండ్రి మళ్ళీ 21 జన్మల కొరకు మిమ్మల్ని సుసంపన్నులుగా చేస్తారు. భక్తి మార్గంలో కూడా తండ్రి అందరి మనోకామనలను పూర్తి చేస్తారు, జ్ఞాన మార్గంలో కూడా సృష్టి ఆదిమధ్యాంతాల జ్ఞానాన్ని ఇచ్చి త్రికాలదర్శులుగా తయారుచేస్తారు.

పాట:- భోళానాథునికన్నా అతీతమైనవారు... (భోలేనాథ్ సే నిరాలా...)

ఓం శాంతి. పిల్లలు భోళానాథుని సమ్ముఖంలో కూర్చుని ఉన్నారు. వ్యాపారస్తులు ఇలా అంటూ ఉంటారు - వేయి, రెండు వేల సరుకును తీసుకుని, మాకు ఎంతో ధనాన్ని ఇచ్చి వెళ్ళేటువంటి తక్కువ బుద్ధి కలవారు ఎవరినైనా పంపించండి, ఓ భగవంతుడా, మాకు ఇటువంటి గ్రాహకులను పంపించండి. ఇప్పుడు భోళానాథుడైన తండ్రి వచ్చి పిల్లలకు ఆదిమధ్యాంతాల రహస్యాన్ని అర్థం చేయించి, త్రికాలదర్శులుగా తయారుచేస్తున్నారు. నా వంటి గ్రాహకుడు మీకు ఎప్పుడైనా లభించగలరా? మీరు వారికి అర్పణ చేస్తారు. భక్తి మార్గంలో ఎంతో మహిమ చేస్తారు. నీవే తల్లివి, తండ్రివి... అని భోళానాథుని మహిమ జరుగుతుంది. వారు వచ్చి రాజయోగాన్ని నేర్పిస్తారు, రాజ్యాన్ని ఇస్తారు. తండ్రితో ఏమంటారంటే - ఈ పాత చెత్త ఏదైతే ఉందో, దానిని మేము మీపై బలిహారం చేస్తాము, మీరు మమ్మల్ని 21 జన్మల కొరకు సుసంపన్నులుగా చేస్తారు. ఇచ్చి-పుచ్చుకునే వ్యాపారం చేసేవారు ఉంటారు కదా, వారు ఒప్పందాలు కుదురుస్తారు, కమీషన్ తీసుకుంటారు. వీరు కూడా అంటారు - దేహ సహితంగా చెత్త ఏదైతే ఉందో, అదంతా మీరు మరణించే సమయానికి చేరుకున్నప్పుడు మీ నుండి తీసుకుంటాను. ఇక్కడ బ్రహ్మాకుమారీలైన మీ వస్త్రాలు కూడా తెల్లగా ఉన్నాయి. మీరు మరణించి ఉన్నట్లు ఉన్నారు. మరణించినవారిపై సదా తెల్లని దుప్పటి వేస్తారు. దానిపై ఎటువంటి మచ్చ ఉండకూడదు. ఈ సమయంలో అందరికీ మాయ యొక్క నల్లని మచ్చ అంటుకుంది, దీనినే రాహు గ్రహణము అని అంటారు. చంద్రునికి కూడా గ్రహణం పట్టినప్పుడు నల్లగా అయిపోతుంది కదా. అలాగే ఈ మాయా గ్రహణం కూడా మొత్తం విశ్వాన్ని నల్లగా చేస్తుంది. ఇందులో తత్వాలు మొదలైనవన్నీ వచ్చేస్తాయి.

తండ్రి కూర్చుని అర్థం చేయిస్తారు - ఇది మీ రాజయోగము. రాజయోగము ద్వారా స్వర్గంలో రాజ్యాన్ని ప్రాప్తి చేసుకోవాలి. మీరు రాజులకే రాజులుగా అవుతారు, నారాయణీ నషా ఉంటుంది. నరుని నుండి నారాయణునిగా అవుతారు. లక్ష్మీ-నారాయణుల రాజ్యం సత్యయుగంలోనే ఉంటుంది. కావున తప్పకుండా నేను అంతిమంలో రావలసి ఉంటుంది. ఇది భక్తి మార్గపు సమయము, భక్తి మార్గములో ప్రతి ముంగిటా తల వంచి నమస్కరిస్తూ ఎదురుదెబ్బలు తింటూ ఉంటారు. భక్తుల రక్షకుడు భగవంతుడు, వారు వచ్చి భక్తి ఫలాన్ని ఇస్తారు. అందరూ భక్తులే కానీ అందరికీ ఒకే రకమైన ఫలం లభించదు. కొందరికి సాక్షాత్కారం జరుగుతుంది, కొందరికి కొడుకు జన్మిస్తాడు, కాని ఇది అల్పకాలికమైన ఫలము. రకరకాల మనోకామనలను పూర్తి చేస్తాను. భగవంతుడు రాజయోగాన్ని నేర్పించేందుకు వచ్చి ఉన్నారని ప్రపంచంలో ఎవ్వరికీ తెలియదు. వారు ద్వాపరములో వచ్చారని, అప్పుడు రాజయోగాన్ని నేర్పించి ఉంటారని భావిస్తారు. మరి అక్కడ నరుని నుండి నారాయణునిగా ఎలా అవుతారు? తండ్రి ఇప్పుడే మీకు రాజయోగాన్ని నేర్పించి రాజులకే రాజులుగా తయారుచేస్తారు. ఇక్కడైతే మీరు కేవలం మౌనంగా ఉండాలి. మన్మనాభవ, ఇదే సద్గురువు యొక్క సహజ వశీకరణ మంత్రము. ఈ మంత్రములో ఎంతో సంపాదన ఉంది. ఇది మాయను తమ ఆధీనము చేసుకునే మంత్రము. మాయను జయించినవారే జగజ్జీతులుగా అవుతారు. భక్తి మార్గం వారు - మనస్సును జయించినవారు జగజ్జీతులుగా అవుతారని భావిస్తారు, దీని కొరకు వారు హఠయోగం మొదలైనవి చేస్తారు. అది కూడా జగజ్జీతులుగా అవ్వడానికి చేయరు, వారు ముక్తి కొరకు చేస్తారు. తండ్రి వచ్చి చెప్తారు - పిల్లలూ, దేహ సహితంగా, సర్వ ధర్మాలను పరిత్యజించండి... నేను ఫలానా ధర్మానికి చెందినవాడిని, నేను ఫలానాను అన్న

విషయాలన్నింటినీ వదిలి స్వయాన్ని ఆత్మగా భావిస్తూ నన్నొక్కరినే స్మృతి చేయండి. నేను ఏ మతాన్ని అయితే ఇస్తున్నానో, దానిపై నడవండి, అంతే. ఇకపోతే ఇప్పటివరకు ఏదైతే అనేక మతాలపై నడుస్తూ వచ్చారో, ఆ మతాలన్నింటినీ వదలాల్సి ఉంటుంది. మీ జ్ఞానం పూర్తిగా కొత్తది. వీరి విషయాలైతే కొత్తగా ఉన్నాయని భావిస్తారు.

పిల్లలైన మీరు ఎవరికైనా అర్థం చేయించేటప్పుడు ముందు వారి నాడిని చూడాలి. అందరి ముందు ఒకేలా అర్థం చేయించకూడదు. మనుష్యులవి అనేక మతాలు. మీదైతే ఒకే మతము. కానీ నంబరువారు ఉన్నారు. ఎవరైతే మంచి యోగంలో ఉంటారో, ధారణ చేస్తారో, వారు తప్పకుండా మంచిగా అర్థం చేయిస్తారు. తక్కువ ధారణ కలవారు తక్కువగా అర్థం చేయిస్తారు. ఎవరైనా సరే వారికి ఒకే సింపుల్ విషయాన్ని తెలియజేయండి - గృహస్థ వ్యవహారంలో ఉన్నా కానీ కమల పుష్ప సమానంగా ఉండండి. కమల పుష్పానికి పిల్ల జల్ల ఎన్నో ఉంటాయని మీకు తెలుసు, మరియు ఉదాహరణ కూడా కమల పుష్పానిదే ఇవ్వడం జరుగుతుంది. తండ్రికి కూడా పిల్లలు ఎంతోమంది ఉన్నారు. కమల పుష్పం తాను స్వయం నీటిపై ఉంటుంది, దాని పిల్ల జల్ల కింద ఉంటాయి. ఇదొక మంచి ఉదాహరణ. బాబా అంటారు - గృహస్థ వ్యవహారంలో ఉండండి కానీ పవిత్రంగా ఉండండి. ఇది పవిత్రతకు సంబంధించిన విషయము. అది కూడా ఈ అంతిమ జీవితంలో పవిత్రంగా ఉంటూ నన్నొక్కరినే స్మృతి చేయండి. రచన యొక్క పాలనను కూడా తప్పకుండా చేయాలి. లేదంటే ఇది హఠయోగం అయిపోతుంది. ప్రపంచంలో పవిత్రంగానైతే ఎంతోమంది ఉంటారు. బాల బ్రహ్మచారులు భీష్మ పితామహుని వంటివారు. స్త్రీ-పురుషులు ఇరువురూ కలిసి ఉంటూ పవిత్రంగా ఎవరైతే ఉంటారో, వారు మంచి బాల బ్రహ్మచారులు. గాంధర్వ వివాహం గురించిన చర్చ అయితే శాస్త్రాలలో కూడా ఉంది, కానీ దాని గురించి ఎవరికీ తెలియదు. దీని గురించి తండ్రే అర్థం చేయిస్తారు. బాబా అంటారు - పిల్లలూ, ఇప్పుడు కామ చితికి బదులుగా ఇరువురూ జ్ఞాన చితి యొక్క కంకణాన్ని కట్టుకోండి. బ్రాహ్మణులైన మీరు ఎంత మంచి పని చేస్తారు. పవిత్రంగా ఉంటాము అని ప్రతిజ్ఞ చేయాలి. ఒకరినొకరు అప్రమత్తం చేసుకుంటూ మీరు ఇరువురూ స్వర్గంలోకి వెళ్ళిపోతారు. ఇక్కడ మీరు కలిసి ఉంటూ పవిత్రంగా ఉండి చూపిస్తారు, అందుకే మీరు చాలా ఉన్నత పదవిని పొందగలరు. ఉదాహరణను ఇవ్వడం జరుగుతుంది కదా. జ్ఞాన చితిపై కూర్చొని స్వర్గంలోకి వెళ్ళి ఉన్నత పదవిని పొందుతారు. ఇందులో ఎంతో ధైర్యము కావాలి, ఒకవేళ పక్కాగా ఉంటూ నడుచుకున్నట్లయితే చాలా ఉన్నత పదవి లభిస్తుంది. ఆ తర్వాత సేవపై కూడా ఆధారపడి ఉంటుంది. ఎవరైతే చాలా సేవ చేస్తారో, ప్రజలను తయారుచేస్తారో, వారు పదవి కూడా మంచిదే పొందుతారు. బాబా-మమ్మా కన్నా ఉన్నతిలోకి వెళ్ళాలి. కానీ ఏ విధంగా - ఆ క్రిస్టియన్లు ఇరువురు ఒకవేళ పరస్పరం కలిసిపోతే విశ్వాధిపతులుగా అవుతారు అని బాబా చెప్తారో, అలా మాతా-పిత కన్నా ఉన్నతిలోకి వెళ్ళే జోడీ ఎవరైనా వెలువడాలి, కానీ అలా ఎవరూ లేరు. జగదాంబ, జగత్పితలే ప్రసిద్ధమైనవారు. వీరు చేసినట్లుగా సేవను ఎవ్వరూ చేయలేరు. వీరు నిమిత్తమై ఉన్నారు, అందుకే ఎప్పుడూ హార్ట్ ఫెయిల్ అవ్వకూడదు. అచ్ఛా, మమ్మా-బాబా వలె కాకపోయినా రెండవ నంబరువారిగా అయినా అవ్వవచ్చు. సేవపై ఆధారపడి ఉంటుంది. ప్రజలను మరియు వారసులను తయారుచేయాలి, మీ ఈ విషయాలు కొత్తవి. కొత్త ప్రపంచాన్ని రచించేందుకు తండ్రి తప్పకుండా రావాల్సి ఉంటుంది. వారే రచయిత. పరమాత్మ నామ-రూపాలకు అతీతుడు అని వారంటారు. కానీ అలా కాదు. వారి దోషము కూడా ఏమీ లేదు. భాగ్యంలో ఉంటే అర్థం చేసుకుంటారు. ఎంతో మంది వస్తారు, ఈ విషయము తప్పకుండా సరైనదేనని అర్థం చేసుకుంటారు కూడా. ఎవరైనా ఆత్మకు నామ-రూపాలు లేవు అని అంటే, మరి ఆత్మ అన్న పేరు ఎవరిది? ఆత్మ అన్న పేరైతే ఉంది కదా. మీరు అందరికీ చెప్పండి - ఇది రాజయోగము, పరమపిత పరమాత్మ సంగమములో వస్తారు, రాజయోగాన్ని తప్పకుండా సంగమయుగంలో నేర్పిస్తారు, అప్పుడే కదా పతితులను పావనులుగా తయారుచేయగలరు. కావున ఇక్కడి విషయమే అతీతమైనది. తండ్రి అంటారు - కేవలం స్వయాన్ని ఆత్మగా భావించండి, తండ్రి వద్దకు వెళ్ళాలి. ఇందులో ప్రశ్నలు అడిగే విషయమేమీ లేదు. నా ఆత్మను దుఃఖపెట్టకండి అని అంటారు, వీరు పాపాత్మ, పుణ్యాత్మ అని కూడా అంటారు. ఆత్మకు ఏ రూపమూ ఉండదని ఎవ్వరూ అనలేరు. వివేకానందుడు రామకృష్ణుని ఎదురుగా కూర్చున్నప్పుడు అతనికి సాక్షాత్కారం కలిగింది, ఒక లైట్ వచ్చి నాలోకి ప్రవేశించింది అన్నట్లు చూసారు. ఇలా ఏదో చెప్తూ ఉంటారు. మీరు చెప్పండి - మాది రాజయోగము, ఇందులో దేహ సహితంగా దేహానికి సంబంధించిన మిత్ర-సంబంధీకులు మొదలైనవారందరినీ మర్చిపోవలసి ఉంటుంది. ఆత్మలమైన మనం వారి పిల్లలము, పరస్పరంలో సోదరభావం ఉంది. ఒకవేళ అందరూ తండ్రులైతే, ఇక తండ్రులే తండ్రులకు ప్రార్థన చేస్తారు. ఇప్పుడు మనం రాజయోగాన్ని నేర్చుకుంటున్నాము. ఇది రాజులకే రాజులుగా అయ్యేటువంటి యోగము. ఇప్పుడైతే రాజ్యము లేదు. ఇతరులకు ఎలా అర్థం చేయించాలంటే - మేము శాంతిగా ఉంటూ కేవలం శివబాబాను స్మృతి చేస్తాము, స్వయాన్ని శరీరం నుండి అతీతంగా భావిస్తాము. నేను ఒక శరీరాన్ని వదిలి ఇంకొకటి తీసుకుంటాను అని ఆత్మ అంటుంది. జ్ఞానమనే సంస్కారము ఆత్మలో ఉంటుంది కదా. మంచి లేక చెడు

సంస్కారాలు ఆత్మలో ఉంటాయి. ఆత్మ నిర్లేపి కాదు, ఇది అర్థం చేయించాలి. ఆత్మ పునర్జన్మలలోకి వస్తుంది. మళ్ళీ-మళ్ళీ ఇంద్రియాలను తీసుకోవాల్సి ఉంటుంది. ఆత్మ నక్షత్రము, భృకుటి మధ్యలో ఉంటుంది. వివేకానందునికి ఆత్మ సాక్షాత్కారం కలిగేటప్పటికి - రామకృష్ణునిలో నాకు ఆత్మ సాక్షాత్కారాన్ని కలిగించేంతటి శక్తి ఉందని భావించారు. ఆత్మ అయితే భృకుటి మధ్యలో ఉంటుంది. సాక్షాత్కారం కలిగినా, కలగకపోయినా తేడా ఏముంది? ఆత్మ స్వయంగా అంటుంది - నేను నక్షత్రాన్ని, నాలో 84 జన్మల పాత్ర ఉంది. ఒకవేళ 84 లక్షల జన్మలు ఉన్నట్లయితే ఇక ఎన్ని సంస్కారాలు ఉంటాయంటే అసలేమైపోతుందో తెలియదు! 84 జన్మలంటే ఒప్పుకోవచ్చు. 84 లక్షల జన్మలు అంటే ఒప్పుకోలేము. ఇప్పుడు మనం పావనంగా అవుతున్నాము. బాబా మమ్మల్ని నరుని నుండి నారాయణునిగా అవ్వడానికి పవిత్రంగా తయారుచేసారు, ఈ నషా చాలా బాగా ఉండాలి. మీరు ఎవరితోనూ వాదించాల్సిన అవసరం లేదు.

దేహ సహితంగా దేహపు సర్వ ధర్మాలను త్యజించి స్వయాన్ని ఆత్మగా, అశరీరిగా భావించాలి. అయితే మనం శాస్త్రాలు మొదలైనవి చదివినా కానీ ఎందుకు చర్చించాలి? ఎందుకంటే తండ్రి - నన్నొక్కరినే స్మృతి చేయండి అని చెప్పారు మరియు రెండవది - గృహస్థ వ్యవహారంలో ఉంటూ కమల పుష్ప సమానంగా పవిత్రంగా ఉండండి అని ఆజ్ఞాపించారు. యోగాగ్ని ద్వారానే పాపాలు నశిస్తాయి. భగవానువాచ, భగవంతుడు కూడా పరమ ఆత్మ, వారిని కూడా నక్షత్రము అనే అంటారు. ఎన్నో పాయింట్లు ఉన్నాయి, అన్నీ ఒకే సమయంలో వెలువడవు. వ్యక్తిని చూసి యుక్తిగా పాయింట్లను తెలియజేయాలి. ఈ విధంగా చెప్పండి - మేము కూడా శాస్త్రాలను చదువుతాము కానీ తండ్రి ఆజ్ఞ ఏమిటంటే - అన్నింటినీ మరచి నన్నొక్కరినే స్మృతి చేయండి. వారు నిరాకారుడు. ఆత్మనైతే అందరూ ఒప్పుకుంటారు. వివేకానందుని అనుచరులు కూడా ఒప్పుకుంటారు. ఆత్మ అయితే అందరిలోనూ ఉంది. తప్పకుండా ఆత్మకు తండ్రి ఉంటారు కదా, వారినే పరమపిత పరమాత్మ అని అంటారు. ఇవన్నీ పాయింట్లు కదా. వీటిని స్మరించడం ద్వారా సదా పాయింట్లు లభిస్తూ ఉంటాయి, స్టీమరు నిండుతూ ఉంటుంది. ఇది కూడా అవినాశీ జ్ఞాన రత్నాల సామాగ్రిని నింపుకున్నట్లు అవుతుంది. పాయింట్లను నోట్ చేసుకుని రివైజ్ చేసుకోండి. ఇవి రత్నాలు, వీటిని ధారణ చేసే మరియు వ్రాసేటువంటి అభిరుచి ఉండాలి. మంచి రీతిలో అందరికీ అర్థం చేయించాలి, ఆత్మ అయితే అందరిలోనూ ఉంది, ఆత్మకు నామ-రూపాలు ఉండవు. ఆత్మకు రూపము ఉన్నప్పుడు పరమాత్మకు ఎందుకు లేదు అని ఎవరూ అనలేరు. వారిని పరమపిత పరమాత్మ, పరంధామ నివాసి అనే అంటారు. పిల్లలకు ఎంతగా అర్థం చేయించడం జరుగుతుంది. కావున ఇప్పుడు సేవ చేసి చూపించండి. బాబా సేవ చేసినందుకు బహుమానము ఇస్తారు. జ్ఞాన రత్నాల అలంకరణను ఎంతగా చేస్తారు. మేము ఇక్కడి పదమపతులుగా అవ్వాలని అనుకోవడం లేదు, మాకైతే విశ్వ రాజ్యాధికారం కావాలి. అచ్ఛా!

మధురాతి-మధురమైన సికీలధే పిల్లలకు మాత-పిత బాప్ దాదాల ప్రియస్మృతులు మరియు గుడ్ మార్నింగ్. ఆత్మిక పిల్లలకు ఆత్మిక తండ్రి నమస్తే.

ధారణ కొరకు ముఖ్య సారము:-

1. ఏ జ్ఞాన రత్నాలైతే లభిస్తున్నాయో, వాటిపై విచార సాగర మంథనము చేసి స్వయంలో ధారణ చేయాలి. జ్ఞాన రత్నాలతో సదా నిండుగా ఉండాలి.

2. తమ నారాయణి నషాలో ఉండాలి, వ్యర్థమైన మాటలను ఎవరితోనూ మాట్లాడకూడదు. అశరీరిగా అయ్యే అభ్యాసము చేయాలి.

వరదానము:- ఆశీర్వాదము మరియు ఔషధము ద్వారా తనువు-మనసుల అనారోగ్యము నుండి ముక్తులుగా ఉండే సదా సంతుష్ట ఆత్మా భవ

ఎప్పుడైనా శరీరము అనారోగ్యముగా ఉన్నా సరే, ఆ శారీరక అనారోగ్యము వలన మనస్సు డిస్టర్బ్ అవ్వకూడదు. సదా సంతోషములో నాట్యము చేస్తూ ఉన్నట్లయితే శరీరము కూడా బాగైపోతుంది. మనస్సు యొక్క సంతోషముతో శరీరాన్ని నడిపించినట్లయితే రెండింటి ఎక్సర్ సైజ్ అవుతుంది. సంతోషమనేది ఆశీర్వాదము మరియు ఎక్సర్ సైజ్ అనేది ఔషధము. కావున దువా (ఆశీర్వాదము) మరియు దవా (ఔషధము), ఈ రెండింటి ద్వారా తనువు-మనసుల అనారోగ్యము నుండి ముక్తులుగా అవుతారు. సంతోషముతో నొప్పిని కూడా మర్చిపోతారు. సదా తనువు-మనసులతో సంతుష్టంగా ఉండాలంటే ఎక్కువ ఆలోచించకండి. ఎక్కువ ఆలోచించటము వలన సమయము వ్యర్థమవుతుంది

మరియు సంతోషము మాయమైపోతుంది.

స్లోగన్:- విస్తారములో కూడా సారాన్ని చూసే అభ్యాసము చేసినట్లయితే స్థితి సదా ఏకరసముగా ఉంటుంది.

మాతేశ్వరిగారి మధుర మహావాక్యాలు

"పరమాత్మ సద్గతిని అందించే విధానము-మార్గము గురించి పరమాత్మకే తెలుసు"

మీరు అందించే విధానము-మార్గము గురించి మీకే తెలుసు... ఇప్పుడు ఈ మహిమను ఎవరి జ్ఞాపకములో పాడుతారు? ఎందుకంటే పరమాత్మ సద్గతిని ఇచ్చే మార్గమేదైతే ఉందో, దాని గురించి పరమాత్మకే తెలుసు, దానిని మనుష్యులు తెలుసుకోలేరు. మనుష్యులకు - మాకైతే సదా కాలం కొరకు సుఖము కావాలి అన్న కోరిక మాత్రమే ఉంటుంది, కానీ ఆ సుఖము ఎలా లభిస్తుంది? ఎప్పటివరకైతే మనుష్యులు తమ 5 వికారాలను భస్మం చేసుకుని కర్మలను అకర్మలుగా చేసుకోరో, అప్పటివరకు ఆ సుఖము లభించదు ఎందుకంటే కర్మ-అకర్మ-వికర్మల గతి చాలా గుహ్యమైనది, వాటి గతిని పరమాత్మ తప్ప మనుష్యాత్మలెవ్వరూ తెలుసుకోలేరు. ఎప్పటివరకైతే పరమాత్మ వాటి గతి గురించి వినిపించరో, అప్పటివరకు మనుష్యులకు జీవన్ముక్తి ప్రాప్తించదు, అందుకే మనుష్యులు అంటారు - మీరు అందించే విధానము-మార్గము గురించి మీకే తెలుసు. వీరికి సద్గతిని అందించే మార్గము పరమాత్మ వద్ద ఉంది. కర్మలను అకర్మలుగా ఎలా చేసుకోవాలి అనే శిక్షణను ఇవ్వటము పరమాత్ముని పని. ఇకపోతే మనుష్యులకైతే ఈ జ్ఞానం లేదు, ఈ కారణంగా వారు తప్పుడు పనులు చేస్తూ ఉంటారు. ఇప్పుడు మనుష్యుల మొదటి బాధ్యత - తమ కర్మలను సరిదిద్దుకోవటము, అప్పుడే మానవ జీవితము యొక్క పూర్తి లాభాన్ని తీసుకోగలుగుతారు. అచ్ఛా. ఓం శాంతి.